క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పరమేశ్వరరావుబుధవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం బల్లెంవారి వీధి, సిండికేట్ బ్యాంక్ కాలనీ, ఒంగూరు లక్ష్మీపతి రోడ్డు, పిన్నమనేని రోడ్డు, ఎస్బీఐ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుస్తుల పంపిణీ



నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామ పంచాయతీ వద్ద పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఒక్కో కార్మికుడికి రెండు జతల చొప్పున దస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మనందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

- పలు అవకతవకల గుర్తింపు
- రూ.95 వేలు రికవరీకి ఆదేశం

ఉంగుటూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2021–22 ఆర్థిక సవత్సరంలో మండలంలోని 27 గ్రామాల్లో రూ.7.16కోట్లతో చేపట్టిన 1114 పనుల సామాజిక తనిఖీలో పలు అవకతవకలకు సంబంధించి రూ.95 వేలు రికవరీ చేయవలసిందిగా హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీ, డ్వామా పీడీ జీవీ సూర్యనారయణ ఆదేశించారు. ఈనెల13 నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులు, అవక తవకలను వివరించారు. పనులకు సంబంధించిన తుది నివేదిక వివరాలను మంగళ వారం రాత్రి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ప్రజా వేదికలో డ్వామా పీడీ, ఏపీడీలు శ్రీలత, వెంకటరమణ, విజిలెన్స్ అధికారి నాగలక్ష్మిల సమక్షంలో వివరించారు. నిబంధనల ప్రకారం పనులు చేయించకపోవటం, కూలీలకు వేసే హాజరులో అవకతవకలు, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, మొక్కల పోషణ నిర్వాహణలోపం, ఎంపీడీవో సంతకం చేయాల్సిన చోట రబ్బరు స్టాంప్ సంతకాలు వేసి వేతనాలు చెల్లించడం వంటి అవకతవకలను గుర్తించారు. రూ.95 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. రబ్బరు స్టాంపు సంతకం విషయంలో పీవో, ఏపీవోకి షోకాజ్ నోటీసులు ఇవ్వాల్సిందిగా పీడీ జిల్లా విజిలెన్స్ అధికారులకు సిఫార్సు చేశారు.

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విగ్రహానికి సంబంధించి డిజైన్లను ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లతో పాటు పరిశీలించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మాణ పనులు జరగాలని ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె అంబేడ్కర్ విగ్రహ భాగాలు జాగ్రత్తగా నిర్మాణం చేయాలని, అనుకున్న సమయానికి అంబేడ్కర్ స్మృతివనం, ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులు సైతం సమయంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. సీఎంవైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు విగ్రహం కింద భాగంలో రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, మినీ థియేటర్, ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఆర్డీఏ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

పనులకు వితరణ



గుడివాడటౌన్ : స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులకు భక్తులు విరాళం ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన రాయల అప్పారావు–నాగరత్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆంజనేయ రత్నప్రసాద్–వెంకట లలిత కుమారి దంపతులు రూ. 10,116, కోనా స్రవంతి రూ. 10,116, కాగిత రామచంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ, విజయకృష్ణ రూ. 10,116 వితరణగా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హరిరాంబాబు, పాలక మండలి సభ్యులు సాంబశివరావు పాల్గొన్నారు.

సర్వత్రా శోభకృత్ సందడి



ఉయ్యూరు శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న సూర్యప్రకాశ శాస్త్రి



రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయం, ప్రసాదంపాడు బాబా ఆలయం, ఎనికేపాడు రామాలయం, నిడమానూరులోని పలు ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పండితులను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, సర్పంచ్ వరి శ్రీదేవి తదితరులు ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెనమలూరు: మండలంలో ఉగాది వేడుకలు భక్తులు ఘనంగా చేశారు. యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో కోటి ఏకలింగ పుణ్యప్రతిష్ఠ ఉగాది వసంత నవరాత్రులు ప్రారంభించారు. దేవాలయంలో శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా శివరామకృష్ణ అవదానిచే పంచాగ శ్రవణం నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నవరం దేవస్థానానికి చెందిన విశ్రాంత ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి గోపాలకృష్ణ, సంతాన దేవస్థాన అర్చకుడు రొపిచర్ల శ్రీనివాసాచార్యులు, గణపతి దేవాలయ అర్చకుడు గోపాల్‌లను శాలువలు కప్పి సత్కరించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు, ఆలయ ప్రధాన అర్చకుడు జీవీఆర్.సాగర్, ఈవో బి.గంగాధరరావు, ప్రముఖులు సంగా సింగయ్య, సంగాసుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు. పెదపులిపాక గ్రామంలో శ్రీ విజయరాజరాజేశ్వరి శ్రీవిజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రులు ఈ నెల 30వ తేదీ వరకు ఆలయంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పోరంకి శ్రీచెన్నకేశవ స్వామివారి ఆలయం, పెనమలూరు, కానూరు, పోరంకి, తాడిగడప, చోడవరం శివాలయాల్లో ఉగాది వేడుకలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉయ్యూరు: శోభకృత్ ఉగాది నామ సంవత్సరానికి ప్రజలు కొంగొత్త ఉషస్సులతో స్వాగతం పలికారు. బుధవారం ఉగాది పర్వదినం కావటంతో వేకువ ఝామున నుంచే ప్రజలు ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. ప్రతి ఇంటా ఉగాది పూజా కార్యక్రమాలు చేసుకుని షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఉయ్యూరు శివాలయం, విష్ణాలయం, ఏజీఅండ్‌ఎస్‌జి సిద్ధార్థ కళాశాల వాకర్స్ క్లబ్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. వేద పండితులు పుచ్చ సూర్యప్రకాశ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, శివాలయం చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, విష్ణాలయం చైర్మన్ లోయ చింతయ్య, వాకర్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ నూకల వెంకట సాంబశివరావు హాజరై భక్తులకు పంచాంగం, క్యాలెండరును అందించారు.

కంకిపాడు: ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లోని ధ్యానయోగ సాయి మందిరంలో ఉగాది వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. వేదపండితులు పోతుకూచి ఆంజనేయ కుమార్ పంచాంగ పఠనం చేసి శోభకృత్ నామసంవత్సరంలో రాశి ఫలాలను వివరించారు. గాయకుడు సాయి షణ్ముఖ్‌ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ కార్యదర్శి కె.నాగప్రసాద్, ఇతర ప్రతినిధులు పర్యవేక్షించారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండంలో ఉగాది పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. నున్న గ్రామం తూర్పు రామాలయంలో వైఖానస పద్ధతిలో స్వామి వారికి పూజలు చేశారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సామ్రాజ్య పట్టాభిషేకం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ అర్చకులు వేదాంతం బాలాజీ పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాగ శ్రవణం జరిగింది. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి ఫణికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం నూతన సంవత్సర ం పంచాంగ శ్రవణం చదివారు. చినకంచి దేవస్థానంలో ఉగాది పండుగ సందర్భంగా పూజా కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేసిన అనంతరం పంచాంగం శ్రవణం జరిగింది.

ప్రజల జీవితాల్లో వెలుగులే లక్ష్యంగా పాలన



ఉయ్యూరులో ఉగాది వేడుకల్లో మంత్రి జోగి రమేష్

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: ప్రజల జీవితాల్లో వెలుగులే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణంలోని బొల్లా నాని గోశాలలో బుధవారం శోభ కృత్ నామ ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ నుంచి వచ్చిన రామానంద దుబే అర్చక బృందం పంచాంగ శ్రవణం చేసి లోక కల్యాణార్థం హోమాలు, పూజలు, అభిషేకాలు జరిపించారు. సప్తరుషి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. శోభకృత్ ఉగాది నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ప్రజారంజక పాలన సాగించే ప్రభుత్వానికి భగవంతుడి దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అర్చక స్వామి రామానంద దుబే మంత్రి జోగి రమేష్‌కు వేద ఆశీర్వచనం అందించి రుద్రాక్ష మాల ధరింపచేసి, ప్రసాదాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, రాజులపాటి చిన్ని, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు, కాపు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దాసు శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పి.నైనవరం గ్రామంలో షిర్డిసాయి బాబామందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా చేశారు. పూజల అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వివేజి కండ్రికలో రామాలయంలో, పాతపాడు గ్రామం చెన్న కేశవస్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి.

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో బుధవారం ఉగాది వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దేవాలయాలను సందర్శించి ఇష్ట దైవాలను పూజించారు. చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో ఆలయ నిర్వాహకులు శ్రీ ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అలంకారాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించారు. ముస్తాబాద, సూరంపల్లి, పురుషోత్తపట్నం తదితర గ్రామాల్లో ఆలయాల్లో భక్తులకు ఉగాది పచ్చడి, ప్రసాద వితరణ చేశారు.

ఆలయాల్లో ఉగాది వేడుకలు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీశోభ కృత్ తెలుగు నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రావణం జరిపారు. ఆలయ అర్చకులు ఎన్. రామాచార్యులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు. స్థానిక సొసైటీపేటలోని గాయత్రి మందిరంలో అమ్మవారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ పంచాగ పూజ, శ్రావణం చేశారు. మందిర కమిటీ అధ్యక్షులు కేసానుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో ఉగాది పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న పంచాంగ శ్రవణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూలమాలలతో అంజనీపుత్రుడిని, ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అధ్యాత్మిక వేదికపై అర్చకులు శృంగారం రామానుజాచార్యులు శోభకృత నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికి మేలు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బందికి పాలక మండలి సభ్యులు చేతుల మీదగా నూతన వస్త్రాలను బహూకరించారు. దెందులూరు మార్కెట్ యార్డు చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, దేవస్థానం పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.



పేరంటాలమ్మ ఆలయంలో పండితులను సత్కరిస్తున్న లోకేశ్వరి తదితరులు



యనమలకుదురులో పూజలు చేస్తున్న ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు నరసింహారావు



గాయకుడు సాయిషణ్ముఖ్‌ను సత్కరిస్తున్న నిర్వాహక ప్రతినిధులు



అభయాంజనేయ స్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు రామానుజాచార్యులు

పీఏసీఎస్‌లో సభ్యులకు డివిడెండ్లు అందజేత



డివిడెండ్లు స్వీకరించిన రైతులతో పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు కల్పించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎల్లప్పుడూ ముందు ఉంటాయని వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులకు ఉగాది పర్వదినం సందర్భంగా రూ.6 లక్షల డివిడెండ్‌ను పంపిణీ చేశారు. 2020–21 సంవత్సరానికి గాను 6 శాతం డివిడెండ్‌ను 1380 మంది సభ్యులకు అందించారు. పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, డైరెక్టర్లు గూడవల్లి రత్న సుధాకర్, గోళ్ల రంగారావు చేతుల మీదగా సభ్యులకు డివిడెండ్ అందజేశారు. వ్యవసాయదారులకు అవసరమైన పంట రుణాలు, రైతు నేస్తం, గోల్డ్ లోన్, విద్యా రుణాలతో పాటుగా రైతు మిత్ర గ్రూపులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇతోధికంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పీఏసీఎస్‌లు బలోపేతమవుతున్నాయని తెలిపారు. రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ సీఈవో కానూళ్ల బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, మాజీ ఉప సర్పంచ్ రాయి శివపార్వతి పాల్గొన్నారు.

నేడు, రేపు విశేష పూజలు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రామమందిరంలో ఈనెల 23, 24 తేదీల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. 23న ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వరుని పూజ, అంకురార్పణ, అభిషేకం, మహా శాంతి హోమం, 24న ఉదయం 7 గంటల నుంచే హోమాలు, విశేష పూజలు, ఉదయం 9.54 గంటలకు పోతురాజు స్తంభ ప్రతిష్ఠ, శ్రీరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కల్యాణం జరుగుతాయని కమిటీ పేర్కొంది. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, దోమ తెరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరికీ మంచి జరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. స్థానిక అయోధ్యనగర్ సూర్యఫిల్లింగ్ స్టేషన్‌లో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి దుప్పట్లు, దోమతెరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా తెలుగు సంవత్సరాది ఉగాదికి నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న సూర్యఫిల్లింగ్ స్టేషన్ అధినేత రంగబాబును ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిష్టా రామలింగమూర్తి, సూర్య ఫిల్లింగ్ స్టేషన్ అధినేత రంగబాబు, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, నాయకులు జి.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్ఆర్, పేరం త్రివేణి రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో మజ్జిగ పంపిణీ ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రాంగణంలో బుధవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన మజ్జిగ పంపిణీని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ప్రారంభించారు. భక్తులు అందజేసిన విరాళాలతో మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. వేసవి కాలం పాటు మజ్జిగ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద ప్రదర్శిస్తామన్నారు. తొలి రోజున ఈఓ భ్రమరాంబ, కె.అమరేంద్ర, నూనె భవానీశంకర్, నాళం వెంకటేశ్వర్లు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, వడ్డాది పాండురంగారావు, పర్శికలు విరాళాలను అందజేశారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వంశీ విరాళం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని దొడ్డి గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ 1.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ పరిమి వంశీ చేతుల మీదుగా బుధవారం ఆలయ కమిటీకి ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రంగారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, సచివాలయ కన్వీనర్లు పరిమి సింధూర, పరిమి విష్ణు, నాయకులు కోనేరు సుబ్బారావు, ఉప సర్పంచ్ అంకం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్



గన్నవరం: ఆరోగ్యకరమైన నవ సమాజం కోసం యువత క్రీడలపై దృష్టి సారించాలని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్కె.ప్రసాద్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను ప్రారంభించిన టీఎస్ఆర్‌కె మాట్లాడుతూ..రానున్న రోజుల్లో క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు మరిన్ని పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పోటీల స్పాన్సర్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సంకాబత్తు వెంకట్‌ను అభినందించారు. అనంతరం ఈ పోటీల్లో విజేతగా నిలిచిన గన్నవరం పోలీసుల జట్టుకు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎయిర్‌పోర్ట్ పోలీసులు, హెచ్‌సీఎల్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఏసీబీ సీఐ వెంకటరమణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.బాలకృష్ణమూర్తి, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్.కిషోర్, రోటరీక్లబ్ కార్యదర్శి జీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆదర్శ్ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామకృష్ణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ రామకృష్ణ మాట్లాడుతూ.. నీటి నిల్వలను పెంచుకుంటూ భావితరాల వారికి సురక్షితమైన నీటిని అందించాలన్నారు. నీటి బ్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యారాధన శ్రేయోదాయకం

విజయవాడ కల్చరల్: సూర్యారాధన శ్రేయోదాయకమని, నిత్య పూజలతో తరించాలని దెందుకూరు సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సూర్యారాధన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య శాస్త్రి సూర్యారాధన విశిష్టతను వివరించారు. దేవాలయ ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లోక శాంతికోసం జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి ఆదేశాలతో సూర్యారాధన నిర్వహిస్తున్నామన్నారు. సూర్యనమస్కారాల వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

• ఈనుతున్న వరి చేలు



ఈడుపుగల్లులో కళకళలాడుతున్న వరి పొలం

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరిపైర్లు కంకులతో కళకళలాడుతున్నాయి. దుబ్బులు చేసి ఈనుతున్నాయి. కంకులు ఏర్పడి, సుంకు తొడిగాయి. పాలుపోసుకుంటున్నాయి. రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3250 హెక్టార్లలో వరి సాగు జరిగినట్లు అంచనా. పొలాలు ప్రస్తుతం ఈని కంకులతో బాలింతలా కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన మోస్తరు వర్షం వరి పొలాలకు మేలు చేకూర్చింది. దుబ్బు విస్తరించటానికి, కంకులు మరిన్ని ఏర్పడేందుకు దోహదపడుతుందని రైతులు భావిస్తున్నారు.

–కంకిపాడు

ధ్యాన సాధనతో మార్పు



మాట్లాడుతున్న దీప్తి ప్రసన్న

రామవరప్పాడు: ధ్యాన సాధనతో మంచి మార్పు, మానవత్వం, భౌతిక, ఆధ్యాత్మిక భావాలు సొంతమవుతాయని స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధి దీప్తి ప్రసన్న అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని శ్రీ శక్తి కల్యాణ మంటపంలో బుధవారం శ్రీ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గురు విశ్వస్ఫూర్తి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం గురు విశ్వస్ఫూర్తి మానవాళికి అనుగ్రహించిన 'ధ్యాన మనో ప్రస్థాన సాధన' ప్రదర్శన నిర్వహించారు. సభాధ్యక్షుడు పైడిపాటి ఉమానాథ శర్మ మాట్లాడుతూ ధ్యాన మనో ప్రస్థాన సాధనతో మనస్సు, బుద్ధి, ఆత్మ స్పష్టతతో మనిషి తనను తాను తెలుసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆథర్ మేక రజనీకాంత్, సత్యవతి, ట్రస్టీలు భానుకృష్ణ, ప్రసాద్, రాఘవరావు, సౌజన్యశ్రీ, జోనల్ ఇన్చార్జి రత్న కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.